

వైభవంగా హరిద్ర శృంగారార్చన

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు.



పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: కాళికా మాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆషాఢమాస ఉత్సవాలు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరులో దేశమ్మ తల్లి ఆషాఢమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. పొంగళ్లు పొంగించి, జలబిందెలతో అమ్మవారికి వారుపోశారు.

సాగుపై సందిగ్ధం

ఖరీఫ్ వచ్చేసింది.. సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేశారు.. రుతు పవనాలు ఉసూరుమనిపించాయి.. నారుమళ్లు పోసుకునేందుకు ఎదురుచూపులు తప్పలేదు.. ఎగువన నీటి నిల్వలు లేవు.. అదును దాటిపోనుంది.. కాలువలకు నీటి విడుదల ఆలస్యమైంది.. సాగునీరు అందుతుందో.. లేదో! అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తేనే ఈ ఖరీఫ్‌లో సాగు సాధ్యమవుతుందని రైతులు చెబుతున్నారు.

- అన్నదాతలకు నీటి కష్టాలు
- ముఖం చాటేసిన వరుణుడు
- ఖరీఫ్‌పై సన్నగిల్లుతున్న ఆశలు
- కృష్ణా జలాలు రానివైనం
- ఖరీఫ్ లక్ష్యం 1,41,916 హెక్టార్లలో సాగు
- అత్యధికంగా వరి 1,03,790 హెక్టార్లలో..
- నారుమళ్లు పోసుకోకుండా ఎదురు చూస్తున్న రైతులు
- గతంలో ఈ సమయానికే సిద్ధంగా నారుమళ్లు



ఖాళీగా ఉన్న పొలాలు



బీడుగా మారిన పొలం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అడపా దడపా తప్ప జిల్లాలో పెద్ద వర్షం కురిసిందిలేదు. నైరుతి రుతుపవనాల ప్రభావమూ కనిపించలేదు. కనీసం ఎగువన భారీ వర్షాలు కురిసి కృష్ణా జలాలైనా సకాలంలో వస్తాయనుకుంటే ఆ ఆశ లేకుండా పోయింది. దీంతో ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకోవాల్సిన అన్నదాతలు అవేమీ లేకుండానే పొలాలు బీళ్లుగా పెట్టుకున్నారు. ఆకాశం వైపు చూపులు తిప్పి వాన చుక్కల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది జూన్‌లో 117.57 మిల్లీ మీటర్ల వర్షం కురవగా జూలైలో ఇప్పటి వరకు కేవలం 39.47 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. జూన్‌లో చెప్పుకోదగిన వర్షాలు కురిసిఉంటే ఇప్పటికే రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకొనేవారు. జూలై ప్రారంభంలో వానలు కురిసినా నారుమళ్లవైపు మొగ్గేవారు. కానీ జూలై నెల నడికొంటున్నా చినుకు జాడలేదు. దీంతో అన్నదాతలు పొలాలు బీళ్లుగా పెట్టుకొని ఆందోళనతో ఉన్నారు.

రుతు పవనాల కబురుతో..

నైరుతీ రుతుపవనాలవల్ల ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో రైతులు భూములను దుక్కులు దున్ని సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో వాటి ప్రభావం కనిపించలేదు. జిల్లాలో వర్షాలు కురవక పోయినా ఎగువ రాష్ట్రాల్లో కురిసి కృష్ణానదికి సకాలంలో నీరుచేరివుంటే కృష్ణా పశ్చిమ డెల్టా కాలువల ద్వారా జిల్లాకు నీరు విడుదల చేసేవారు. సకాలంలో వరిసాగు జరిగేది. కానీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేక కృష్ణా కెనాల్ నీటిని నామామాత్రంగా విడుదల చేశారు. దీంతో ఖరీఫ్‌లో సాగు ప్రశ్నార్థంగా మారింది. జూన్ నుంచే విత్తనాలు కొని పెట్టుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగు ఆలస్యం



ఈ సీజన్‌లో ముందస్తుగా భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకోలేకపోయారు. బోర్ల సౌకర్యం ఉన్న రైతులు కొంతమేర నారుమళ్లు పోసుకున్నారు. కృష్ణా వాటర్ అందుబాటులో ఉండి ఉంటే జూలై ఆఖరు నుంచే వరినాట్లు వేసేవారు. వర్షాలు తక్కువగా కురవటం, కెనాల్ వాటర్ రాకపోవడంతో వరి సాగు కొంత ఆలస్యమవుతుంది. ఈ పరిస్థితిలో రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేయాలి. ఇప్పటికే రైతులకు పచ్చిరొట్టె విత్తనాలతోపాటు వరి విత్తనాలు అందించాం.

–వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

ఖరీఫ్ సాగు ఇలా....

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 1,41,916 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 1,03,790 హెక్టార్లలో వరి, పత్తి 4,205 హెక్టార్లు, మినుము 2, 275, కంది 1,960, వేరు శనగ 926, మొక్కజొన్న 803 హెక్టార్లలో సాగు కానుంది. ఇవి కాకుండా కూరగాయల పంటలు, సజ్జ, రాగి, సామ, ఆరిక తదితర పలు రకాల పంటలు కలిపి 38,126 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కృష్ణాడెల్టా ఆయకట్టు...

జిల్లాలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద అత్యధికంగా ఖరీఫ్ సీజన్‌లోనే 2,59,475 ఎకరాల్లో వరిపంట సాగుకానుంది. ప్రధానంగా వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో ఖరీఫ్‌లో వరి చేస్తుంటారు. వేమూరు ప్రాంతంలో జూన్ నుంచే వరిపంట సాగు కానుండగా మిగిలిన చివరి ఆయకట్టు(టెయిలెండ్) ప్రాంతాలైన రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో జూలై మొదలు ఆగస్టు వరకు వరిపంట సాగువుతుంది.

ఇప్పటి వరకు సాగు..

ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 80 హెక్టార్లలో వరి పంట సాగు చేయగా మూడు హెక్టార్లలో జొన్న, 25 హెక్టార్లలో మొక్కజొన్న, 5 హెక్టార్లలో కంది, 41 హెక్టార్లలో మినుము, 259 హెక్టార్లలో వేరుశనగ, 7 హెక్టార్లలో శనగ, 70 హెక్టార్లలో నువ్వులు, 26 హెక్టార్లలో పత్తి పంటలు సాగయ్యాయి. కొంత మేర ఉద్యాన పంటలు సాగు అయ్యాయి. ఖరీఫ్ వరి సాగు కోసం రైతులు సిద్ధం చేసుకున్న పొలాల్లో పచ్చిరొట్టె ఎరువుల ఏర్పాటు కోసం జీలుగ, పిల్లిపెసర, మినుము పంటలను సాగుచేశారు.

అమ్మవారి దేవాలయంలో చోరీ

రూ.6 లక్షల విలువైన ఆభరణాలు అపహరణ



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

భట్టిప్రోలు: స్థానిక రుద్రభూమిలో కొలువైన గుండిపార్వతి అమ్మవారి దేవాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం.. అర్ధరాత్రి గుడి తాళాలు పగలకొట్టి రూ.6 లక్షల విలువ చేసే అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలతో పాటు ఆవరణలోని హుండీని కూడా ధ్వంసం చేసి నగదు తస్కరించారు. హుండీని రుద్రభూమి గోడ అవతల విసిరేశారు. ఉదయాన్నే దేవాలయ అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు విచ్చేయగా తలుపులకు తాళాలు బద్దలు కొట్టి ఉండటంతో కమిటీకి సమాచారం అందించారు. కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం వేమూరు సీఐ పసుపులేటి రామకృష్ణ, భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు దేవాలయానికి విచ్చేసి పరిశీలించి వివరాలు సేకరించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పీఎం కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధికి అధికారి పి.ప్రణయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ విద్యార్హత కలిగిన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు 98663 66187, 95332 19919 లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడు కొలనుకొండకు సీఎం చంద్రబాబు



తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం తాడేపల్లి మండల పరిధిలోని కొలనుకొండలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో అనంత శేష స్థపన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ శుక్రవారం పరిశీలించారు. సీఎం పాల్గొననున్న పూజా కార్యక్రమ స్థలాన్ని, సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి తహసీల్దార్ విజయకుమార్, ఆర్అండ్‌బీ, విద్యుచ్ఛక్తి, ఎంటీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం




బాపట్ల: పట్టణంలోని కాకుమానువారిపాలెం లోని అమ్మవారి కొలుపులు సందర్భంగా ఆలయానికి లక్ష రూపాయలు విరాళాన్ని జీఎస్ఆర్ టౌన్‌షిప్ అధినేత గుండ్రెడ్డి శివ శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు శివరామకృష్ణ, శివనాగేశ్వరరావు, రాఘవరావు, శివబ్రహ్మం, గోపి, సాంబూ, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, ఉషా పాల్గొన్నారు.

యార్డులో 25,626 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,027 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,626 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,500 నుంచి రూ.18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,347 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,716 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,005 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 476 క్యూసెక్కులు విడుదల చేయగా తూర్పు కెనాల్, పశ్చిమ కెనాల్, నిజాంపట్నం కాలువ, హై లెవల్ కాలువకు నీటిని విడుదల చేయలేదు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2800, గరిష్ఠ ధర రూ.4500, మోడల్ ధర రూ.3700 వరకు పలికింది.

తీరప్రాంతాల్లో పర్యాటకుల రక్షణకు పటిష్ట చర్యలు

- నిర్ణీత లోతులో ఎరుపురంగు జెండాలు ఏర్పాటు
- మద్యం తాగి సముద్రంలో అడుగుపెడితే కేసు
- విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: సముద్ర తీరప్రాంతాల్లో పర్యాటకుల రక్షణకు పటిష్టచర్యలు చేపట్టినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు తీరాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని చెప్పారు. గత నెలలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాల నేపథ్యంలో తాత్కాలికంగా సముద్ర తీరంలోకి అనుమతించలేదని వివరించారు. బాపట్ల జిల్లాలోని రిసార్ట్స్ నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సహకారంతో యాత్రికులు సముద్రంలో మునిగే ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. గజ ఈతగాళ్లకు రక్షణగా లైఫ్ జాకెట్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పటిష్ట గస్తీ..

సివిల్, మెరైన్ పోలీస్‌లతో తీరం వెంబడి గస్తీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. తగిన భద్రత చర్యలు తీసుకున్న అనంతరం పర్యాటకులను తిరిగి అనుమతించినట్లు చెప్పారు. పోలీసు హెచ్చరికలు పర్యాటకుల రక్షణ, భద్రత కోసమే అని తెలుసుకోవాలని సూచించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలల ఆటుపోట్లను గమనిస్తూ సముద్రంలో ఎక్కువ లోతుకు వెళ్లకుండా పోలీస్ వారు సూచించిన లోతు వరకే వెళ్లి స్నానాలు ఆచరించాలన్నారు. తీరంలో ఏర్పాటు చేసిన ఎరుపురంగు జెండాలు దాటి లోతుకు వెళితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. యువకులు, విద్యార్థులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సముద్ర స్నానాలకు వచ్చే యువకులపై నిఘా ఉంచడం జరుగుతుందన్నారు.

పంట కాలువలో బోల్తా పడిన బస్సు

ప్రయాణికులు సురక్షితం



బోల్తా పడిన బస్సును పరిశీలిస్తున్న ఎస్ఐ

జె.పంగులూరు: లైట్లు ఫెయిలవడంతో ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు పంటకాలువలో బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్లపాడు గ్రామాల మధ్య జరిగింది. వివరాలు.. అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 19 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 6.45 గంటలకు అద్దంకి బస్టాండ్ నుంచి బయలుదేరింది. బస్సు డ్రైవరు పిచ్చయ్య, కండక్టర్ సురేష్ ఉన్నారు. బస్సు చందలూరు మీదుగా ఇంకొల్లు వెళ్లాల్సి ఉంది. తూర్పు తక్కెళ్లపాడు దాటి కొంత దూరం ప్రయాణించగా ఒక్కసారిగా లైట్లు మొత్తం ఆగిపోయాయి. దీంతో బస్సు కంట్రోల్ చేసి బస్సు ఆపేలోపే రోడ్డు పక్క పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 19 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేస్తూ బయటకు వచ్చారు. ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

త్రికోటేశ్వరుడికి రూ. 81.72 లక్షల ఆదాయం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, సింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓ సీహెచ్ నాగిరెడ్డి పర్యవేక్షించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.76,63,351, అన్నదానం హుండీ ద్వారా రూ.5,09,440 ఆదాయం లభించినట్లు వివరించారు. 125 రోజులకు గాను మొత్తం రూ.81,72,791 వచ్చినట్లు వెల్లడించారు. దీంతో పాటు వెండి 695 గ్రాములు, బంగారం 36.500 గ్రాములు, విదేశీ కరెన్సీ 105 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్స్, రెండు సింగపూర్ డాలర్లు, 100 పౌండ్లు సూడాన్ కరెన్సీ హుండీల ద్వారా వచ్చినట్లు వివరించారు.

క్లుప్తంగా

26 పరుగులతో కర్నూలు విజయం

ఐదు వికెట్లు సాధించిన సాయి సూర్యతేజ్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్ బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీల్లో శుక్రవారం కర్నూలు, కడప జిల్లాల జట్లు తలపడ్డాయి. ఇందులో కర్నూలు జట్టు 26 పరుగుల తేడాతో కడప జట్టుపై విజయం సాధించింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో రెండవ రోజు ఓవర్ నైట్ స్కోర్ ఎనిమిది వికెట్లు నష్టానికి 117 పరుగులతో చివరిరోజు ఆట ప్రారంభించి మరో ఏడు పరుగులు జోడించి ఆలౌట్ అయింది. జట్టులోని పి.రోహిత్‌గౌడ్ 32 పరుగులు చేయగా, కడప బౌలర్ ఏ.శుభకాశ్యప్ మూడు వికెట్లు సాధించాడు. అనంతరం 186 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 160 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.సాయిసాకేత్ 63 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఓటమి తప్పలేదు. కర్నూలు బౌలర్ కె.సాయిసూర్య తేజ్ 14ఓవర్లు వేసి 33 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించి కడప ఓటమిని శాసించాడు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పొలాల్లో రైతు బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: పొలాల్లో రైతు బలవన్మరణం పొందిన ఘటన చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..16వ నంబర్ జాతీయ రహదారిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పంట పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానిక రైతులు శుక్రవారం గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతని వద్ద ఉన్న ఆధారాల సేకరించారు. మృతుడు పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన బాదుగుల నాగరాజు(38)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నూతలపాడు గ్రామంలోని పురుగుల మందుల షాపులో పనిచేస్తూ 20 ఎకరాలను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అందులో రూ.45 లక్షలు నష్టం వచ్చి అప్పుల పాలు కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో చెప్పకుండా వచ్చి ఈ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సామ్రాజ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీలు

- బయటపడ్డ ఈసీజీ టెక్నిషియన్ల పని తీరు
- రాత్రి నుంచి కనపడని సిబ్బంది
- క్యాజువాల్టీలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ దందా
- పోలీసులకు అప్పగింత



తనిఖీల సందర్భంగా ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్‌ను ప్రశ్నిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రోగులు, వారి సహాయకుల ఫిర్యాదుల మేరకు గుంటూరు జీజీహెచ్‌లో గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో డొల్ల తనం కనిపించిన చోట వైద్యులకు వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాజువాల్టీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఒకరు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పని చేస్తున్నారని చెప్పారు. రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మరొకరిని నియమించాలని ఆదేశించినా కాంట్రాక్టర్ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అర్ధరాత్రి తనకు ఫోన్ చేసి సిబ్బంది పని చేయడం లేదని రోగులు ఫిర్యాదులు చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా గమనించి మరొకరిని నియమించేలా కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరేడు నెలల నుంచి ఈసీజీ టెక్నిషియన్ రాత్రి పూట ఒకరు మాత్రమే పని చేస్తున్నారని, మరొకరు అర్ధరాత్రి నుంచి విధులకు డుమ్మా కొడుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామన్నారు.

ఈసీజీ రోల్స్ దందాపై విచారణ

ఈసీజీ రోల్స్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రోజూ ఈసీజీ రోల్స్ ఎవరు ఇస్తున్నారు, ఇండెంట్ ఎవరు ఇస్తున్నారు, ఎవరి ద్వారా తీసుకుంటున్నారు అనే అంశాలపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించామని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈసీజీ రోల్స్ బయటకు తీసుకుని వెళ్లి దందా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై వెంటనె విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు

డీఎంపీ వైద్యుడు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స విభాగంలో అనధికారికంగా తిరుగుతున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నిషియన్‌ను గుర్తించి ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. అనంతరం ట్రయల్ రన్‌లో ఉన్న సీటీ స్కాన్ మిషన్‌ను సూరిటెండెంట్ పరిశీలించారు.

సర్వీస్ ఇంజినీర్‌తో మాట్లాడి వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆధునిక కేర్ యూనిట్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యసమాజం

బిహార్ బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బిహార్ బృందం

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బీహార్‌కు చెందిన రూరల్ లైవ్లీహుడ్స్ రాష్ట్ర కార్యాలయం ప్రతినిధుల బృందం అనిల్‌కుమార్‌యాదవ్, వంశీకృష్ణారెడ్డి, కునాల్‌కిషోర్, కౌటిల్యకుమార్, సంతోష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజకుమారి ఇక్కడి రైతులు అవలంబిస్తున్న పద్ధతుల గురించి బిహార్ ప్రతినిధులకు వివరించారు. ప్రకృతి సేద్యంలో మహిళా సంఘాల పాత్ర గురించి సంఘ సభ్యులతో బిహార్ ప్రతినిధులు సమావేశమై చర్చించారు. గ్రామానికి చెందిన ప్రకృతి రైతు గురవయ్య అవలంబిస్తున్న యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఏ గ్రేడ్ మోడల్‌ను బిహార్ ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌పీసీ వెంకటరావు, ఏవో శ్రీనివాసరావు, డీఎల్‌ఎమ్‌పీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం రైతులు, మహిళా సంఘాల మహిళా రైతులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదమే ఘర్షణకు కారణం

ఇరువర్గాలకు చెందిన 17మందిపై కేసు నమోదు



వెల్దుర్తి: ఇటీవల మండలంలోని శ్రీరాంపురం తండాలో జరిగిన ఘర్షణ రాజకీయ పరమైంది కాదని, రెండు కుటుంబాల మధ్య జరిగిన స్థల వివాదమే కారణమని మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాంపురం తండాలో ఓ స్థలం విషయంలో కేతావత్, పాత్లావత్ వర్గాల మధ్య గత 20 ఏళ్లుగా వివాదం జరుగుతోందన్నారు. కేతావత్ గోవిందునాయక్ ఈ స్థలంపై ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొని పాత్లావత్ వర్గం వారికి నోటీసులు పంపినట్లు చెప్పారు. దీంతో పాత్లావత్ అంజీనాయక్ ఆధ్వర్యంలో పొక్లెయిన్ తీసుకొచ్చి ఇంటిని ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయంపై పాత్లావత్ పెద అంజీనాయక్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. పాత్లావత్ అంజీనాయక్‌పై దాడి చేసిన గాయపరిచిన విషయంలో కేతావత్ హనుమానాయక్‌తో పాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ తాలూకా రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అరకొరగా సరఫరా చేసిన ఘటనను వెలుగులోకి తెస్తూ గురువారం ''సాక్షి''లో అందని పాఠ్య పుస్తకాలు–ప్రారంభం కాని పాఠాలు శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5,557 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇండెంట్ ప్రకారం ఐదు విడతల్లో వెండర్ నుంచి మండల స్టాక్ పాయింట్‌కు వచ్చినట్లు సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. పాఠ్య పుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేశామని, ఒకటో తరగతి తెలుగు రీడర్ 60, ఏడు తరగతి ఇంగ్లీష్ రీడర్ 50 పుస్తకాలు రావాల్సి ఉన్నాయని పేర్కొన్నారు.విద్యార్థులకు ఇండెంట్ ప్రకారం బ్యాగులు, యూనిఫాం, బెల్టులు, నోటు పుస్తకాలు, బూట్లు నూరు శాతం పంపిణీ చేశామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో భూ ఆరోగ్యం పదిలం

జిల్లా వనరుల కేంద్ర డెప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న డెప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల

అద్దంకి: ప్రకృతి వ్యవసాయంతో భూ ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల అన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల భూ ఆరోగ్యం పాడై భావితరాలకు సారం లేని భూములను అప్పగించాల్సి వస్తుందన్నారు. కలవకూరు రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన 'ప్రకృతి వ్యవసాయం–రసాయన ఎరువుల సమతుల్యత', భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయం అనే శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం, భూ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఆలోచించాలన్నారు. భూముల్లో అధిక దిగుబడుల కోసం వాడే రసాయన ఎరువుల వలన మనుషులకు అనేక రకాల జబ్బులు, రావడంతో పాటు, భూ ఆరోగ్యం పాడైపోయి విత్తనాలు వేసినా పంటలు పండే పరిస్థితి ఉండదని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయించి అవసరమైన మేరకే రసాయన ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ మురళీధర్ నాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందులు సిఫారసు మేరకు మార్చిమార్చి చల్లుకోవాలన్నారు. అలా కాకుండా ఒకే మందు పిచికారీ వలన వ్యాధికారక జీవులు వాటిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. ప్రతి రైతు తక్కువ రకం మందులను మార్చి మార్చి వాడి చీడపీడలను నివారించుకోవాలని చెప్పారు. అధిక దిగుబడుల కోసం అత్యధిక మోతాదులో రసాయన ఎరువులను వాడటం వలన భూ ఆరోగ్యం, మనిషి ఆరోగ్యం పాడవుతుందని వివరించారు. ఏడీఏ ధన్‌రాజ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు




బాధిత మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: ఆక్రమణల తొలగింపు పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బాధితులకు వైఎస్సార్ సీపీ తరఫున అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హామీ ఇచ్చారు. శుక్రవారం కొల్లూరు శివారు గాంధీనగర్‌లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు చల్లంచర్ల కనకదుర్గ హోటల్ నిర్వహిస్తుండగా టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటంతో ఆమె ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై స్పందించిన అశోక్‌బాబు కొల్లూరులో ఆమె నిర్వహిస్తున్న హోటల్‌ను పరిశీలించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్ అండ్ బీ రోడ్డు వెంబడి ఆక్రమణలున్న పక్షంలో గ్రామంలో ఉన్న ఆక్రమణలు మొత్తం తొలగించాలి గాని, వ్యక్తిగత కక్షలతో ఎస్టీ మహిళ జీవనోపాధి పొందుతున్న హోటల్‌ను కూలగొట్టడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించడం అన్యాయమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు అన్న సాకుతో అరాచకాలకు పాల్పడాలని చూడటం తగదని అశోక్‌బాబు హితవు పలికారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 6 కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చీరాల టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడికి యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దండుబాట రోడ్డులో మాడపాటి వీరంజనేయులు, రాజు జయలక్ష్మి, వల్లభ శామ్యూల్, నల్లగొర్ల రాజేష్, కావూరి నాని గంజాయి విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. చీరాల టూటౌన్ సీఐ, ఎస్ఐ.వెంకటేశ్వర్లు, హెచ్ కానిస్టేబుల్ డీ శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, షేక్ నాగూర్‌వలి, ఎస్.ఆంజనేయులు, మహిళా కానిస్టేబుల్ ఎస్.స్వరూపలను ఎస్పీ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యం

ఏపీసీ వెంకట సుధాకర్



జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఏపీసీ వెంకటసుధాకర్

బాపట్ల టౌన్: పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.వెంకట సుధాకర్ తెలిపారు. మండలంలోని కొండుబోట్లవారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం అమ్మపేరిట మొక్క నాటుదాం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఏపీసీ వెంకట సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలతో పాటు నివాస గృహాల సమీపంలో కూడా మొక్కలు నాటి వాటికి ప్రతిరోజు నీరుపోస్తూ ప్రేమతో పెంచుకోవాలన్నారు. మీకు తల్లి అంటే ఎంత ఇష్టమో మొక్కలను కూడా అంతే ఇష్టంగా ప్రేమించాలని సూచించారు. ప్రస్తుతం మీరు నాటే మొక్కలే భవిష్యత్‌లో మానవ మనుగడకు అవసరమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. మన పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కూడా ఈ మొక్కలే దోహద పడుతాయని వివరించారు. పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు ఉసిరి, గోరింటాకు మొక్కలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఇప్పటికి 2,500 మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ బి.మోజెస్, డీసీడీవో ఎం.చారులత, హెచ్ఎం కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి



తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు పిలుపు మేరకు యూనియన్ తెనాలి శాఖ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెనాలి శాఖ చైర్మన్, కార్యదర్శి నరేష్, వేణుగోపాల్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జి.రవిబాబు, ఎం.నరేష్, బి.ప్రభాకరబాబు, గోపినాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రసన్నకుమార్, రాజశేఖర్ పిచ్చియ్య, వినయ్‌కుమార్, మల్లేశ్వరి తదితర రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

పేరుకే బహిరంగం... టీడీపీ కనుసన్నలలోనే వేలం

అచ్చంపేట: టీడీపీ కనుసన్నలలోనే వేలం పాటలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయం, ఓర్వకల్లులోని గంగాదేవి పేరంటాలమ్మ దేవాలయాల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసుకుని ఏడాది పాటు విక్రయ హక్కులు పొందేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తారు. దేవాలయం వద్ద గురువారం జరగాల్సిన బహిరంగ వేలాన్ని కారణం లేకుండానే వాయిదా వేశారు. ఈ విషయం కనీసం ఆలయ కమిటీ చైర్మన్‌కు గానీ గ్రామ సర్పంచికి కూడా తెలియదు. స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన నాయకులు కలసి వారికి అనుకూలమైన వారికి వేలం లేకుండానే నామమాత్రపు రేట్లపై స్టాల్స్ కట్టబెట్టేందుకే వాయిదా వేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే అమ్మవారి దేవాలయానికి రావాల్సిన ఆదాయం గణనీయంగా పడిపోవడం ఖాయం. అయితే, కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి మాత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. కానీ ఆ కారణాలు ఏమిటో చెప్పలేకపోవడం గమనార్హం.

గంగాదేవి ఆలయం వద్ద వేలం

ఓర్వకల్లులోని గంగాదేవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద స్టాల్స్ నిర్వహణ హక్కులు పొందేందుకు శుక్రవారం నిర్వహించిన వేలంలో(బహిరంగం కాదు) గతం కంటే 10శాతం కన్నా తక్కువ ధరలతో అనుకూలమైన వ్యక్తులకు పాటలు కొట్టి వేశారు. ఎనిమిది రకాల వ్యాపారాలకు వేలం నిర్వహించారు. గత ఏడాది ఈ వ్యాపార హక్కులపై అమ్మవారి దేవాలయానికి రూ.7,44,000 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అన్ని వ్యాపారాలపై కలపి రూ.65000 మాత్రమే పెంచి రూ.8,15,000కు కొట్టేశారు. వేలం విషయం గ్రామ సర్పంచి, ఆలయ కమిటీ చైర్మన్‌లకు కనీస సమాచారం లేనట్లు తెలిసింది. టీడీపీ, జనసేన నాయకులు మాత్రమే హాజరు కావడం గమనార్హం. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రామకోటిరెడ్డి, టీడీపీ నాయకుడు పూల కోటేశ్వరరావు, జనసేన నాయకుడు పూల నాగరాజు పాల్గొన్నారు.

పథకాలపై మత్స్యకారులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా అధికారి సురేష్

చీరాల: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఇతర పథకాలపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.సురేష్ సూచించారు. శుక్రవారం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులతో కేంద్ర మత్స్యశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖాముఖి మాట్లాడారు. దీనిలో భాగంగా మధురై, తమిళనాడులో సమ్మర్ మీట్-2024 కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై జిల్లా అధికారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బీ కృష్ణకిషోర్, అభివృద్ధి అధికారి ఎం రవీంద్ర, టీ రఘుకిషోర్‌రెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల మహోత్సవం



అమ్మ వారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మొదటి శుక్రవారం కావడంతో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి చీర, జాకెట్, వడికట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు కుంకుమతో బోనాలను సమర్పించారు. ఆలయ పూజారి పూర్ణానందశాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్త పేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులతో పాటు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గత 19 ఏళ్లుగా సీఏ సీఎంఏ కోర్సుల్లో 450కు పైగా అఖిల భారతస్థాయిలో ర్యాంకులు సాధించామని తెలిపారు. ప్రస్తుత ఫలితాల్లో తమ విద్యార్థి ఎస్.సంతోష్ కుమార్ 400 మార్కులకు గాను 338, షేక్ ఫిర్దోస్ 316, బి. నరసింహ సాయి ధీరజ్ 312, బి.వెంకట శివ సాయి కార్తీక్ 310, ఎస్.భువన్ వెంకట సాయి 304, కె.తిరుమల సాయి సంతోష్ 304, వి.శరణ్య లక్ష్మి 302, బి.రాహుల్ 302, ఎన్.భవ్య సాయి 300, ఎస్. కిషోర్ 300, షేక్ సలాం 300 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అందిస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థుల అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.